31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

మంగళవారం 10 మార్చి 2026 పేజీలు : 8

## 2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష



**చురకలు విలేకరి, ధర్మపురి, మార్చి 9 :** 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్ల నేపథ్యంలో చేపట్టాల్సిన భూసేకరణ (ల్యాండ్ అక్విజిషన్), దేవాలయ అభివృద్ధి పనులపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధుల, వికలాంగుల, ట్రాన్స్ జెండర్ సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ కలిసి సోమవారం ఈవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రానున్న గోదావరి పుష్కరాలు రాష్ట్రానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆధ్యాత్మిక వేడుక అని మంత్రి తెలిపారు. ఈ పుష్కరాలకు దేశం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే. అవకాశమున్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పుష్కరాలకు అవసరమైన భూముల సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు. పుష్కరాల సమయంలో ప్రతిష్ఠను తీసుకువచ్చేలా ఉండాలన్నారు

# మైనార్టీల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ
- గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రొసీడింగ్స్ అందజేత



**చురకలు ప్రతినిధి, ధర్మపురి మార్చి 9:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలంగాణ ఎస్సీ ఎస్టీ దివ్యాంగుల ట్రాన్స్ జెండర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు సోమవారం మండలంలోని షాదీఖానాలు నియోజకవర్గానికి చెందిన మైనార్టీలకు కుట్టు మిషన్ల పంపిణీ చేశారు. జిల్లాలో మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబనను ప్రోత్సహించేందుకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడంతో పాటు గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఎక్స్‌గ్రేషియా సహాయం అందజేశారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మైనారిటీ మహిళలు ఆర్థికంగా బలపడేలా స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలు తమ ప్రతిభను ఉపయోగించి స్వయం ఉపాధి పొందేలా కుట్టు మిషన్ల పంపిణీ చేపడుతున్నామని చెప్పారు. కుట్టు మిషన్ల ద్వారా మహిళలు తమ ఇంటి వద్ద నుంచే ఉపాధి పొందుతూ కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవచ్చన్నారు. మహిళల సాధికారతే సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ మహిళల అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లిన వారు అనుకోని పరిస్థితుల్లో మరణించినప్పుడు వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని ఆయన అన్నారు. అలాంటి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా సహాయాన్ని అందజేస్తోందన్నారు. ఈ సహాయం ద్వారా బాధిత కుటుంబాలకు కొంత ఆర్థిక భరోసా కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలను గ్రామ స్థాయిలో ప్రజలకు చేరేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం లక్ష్యం సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా చేయడం అని పేర్కొన్నారు. మైనారిటీల విద్య, ఉపాధి, –2లో

### వేం నరేందర్ రెడ్డికి

## శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 9 :** రాజ్యసభ సభ్యులుగా ఎంపికైన వేం నరేందర్ రెడ్డి కి మంత్రులు తదితరులు సోమవారం శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యసభ ఎంపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా అసెంబ్లీ లో రిటర్నింగ్ అధికారుల నుంచి అధికారిక ధృవీకరణ పత్రాన్ని వెంనరేందర్ రెడ్డి అందుకోవడం జరిగింది. ఈ అవకాశం కల్పించిన కాంగ్రెస్ అధిష్టానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, రాజ్యసభలో తెలంగాణ గళం వినిపించి రాష్ట్ర సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను అని శుభకాంక్షలు తెలియజేసిన మంత్రులకు, పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలియ జేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ,వాకిటి శ్రీహరి ,తుమ్మల నాగేశ్వర రావు , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , ఎంపీ బలరాం నాయక్ ,ఎమ్మెల్యేలు ఇతర నాయకులు హాజరయ్యారు.

### గోదావరి నది తీరంను

## పరిశీలించిన కలెక్టర్

- పారిశుధ్య పనులపై పలు సూచనలు
- సామాజిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



**చురకలు ప్రతినిధి, ధర్మపురి, మార్చి 9:** ధర్మపురి పట్టణంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సోమవారం పర్యటించి గోదావరి తీరంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ముందుగా గోదావరి తీరం వద్ద పారిశుధ్య పరిస్థితులను ఆయన పరిశీలించి అక్కడ నిర్వహిస్తున్న శుభ్రత పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోదావరి తీరం వద్దకు పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు వచ్చే నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యం శుభ్రత పనులు నిర్వహిస్తూ ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించాలని ఆదేశించారు. గోదావరి తీర ప్రాంతంలో చెత్తను సమయానికి తొలగించడం, చెత్త బుట్టలను ఏర్పాటు చేయడం, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. అలాగే గోదావరి తీరం పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా మున్సిపల్ సిబ్బంది క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. 2027 సంవత్సరంలో గోదావరి పుష్కరాలు –2లో

### సైబర్ మోసాలకు గురైతే వెంటనే

## 1930కి ఫిర్యాదు చేయాలి

**సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 9:** సైబర్ మోసలకు గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ డిఎస్పి వెంకటరమణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ మహిళా నర్సింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు సైబర్ భద్రతపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డిఎస్పి వెంకట రమణ మాట్లాడుతూ మహిళలు, ముఖ్యంగా విద్యార్థినులు సోషల్ మీడియా వేదికల ద్వారా జరుగుతున్న వివిధ రకాల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ స్టాకింగ్, సైబర్ బుల్లీయింగ్ వంటి సమస్యలు ఇటీవలి కాలంలో పెరుగుతున్నాయని, సోషల్ మీడియా లేదా మెసేజింగ్ యాప్స్ ద్వారా అసభ్యకరమైన సందేశాలు పంపడం, వేధించడం, బెదిరించడం వంటి చర్యలు సైబర్ నేరాల పరిధిలోకి వస్తాయని వివరించారు. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు –2లో

## వైభవంగా కాకర్ల మల్లన్న జాతరోత్సవాలు



**చురకలు విలేకరి, ఇబ్రహీంపట్నం,మార్చి 9 :** ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటి కొండాపూర్ గ్రామంలో కాకర్ల మల్లన్న జాతరోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. నేడు అగ్ని గుండాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యూత్ అధ్యక్షులు రెబ్బటి రాజశేఖర్ యాదవ్, గ్రామ ఉపసర్పంచ్ రెబ్బస్ సాగర్ యాదవ్, వార్డు సభ్యులు రెబ్బస్ మధు యాదవ్, గట్టు సాయన్న, ముక్కెర రామాంజనేయులు, బోయ పెల్లి దేవేందర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## జీవిత బీమా కుటుంబానికి ధీమా



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (నిర్మల్) మార్చి 9 :** జీవిత బీమా చేసి కుటుంబానికి ధీమాగా ఉండాలని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ డీజీఎం సురేష్ అన్నారు.నిర్మల్ జిల్లా పెంబి మండలంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ నందు భూరే రాజేశ్వర్ రెండు సంవత్సరాల క్రితం 30510/-పాలసీ తీసుకోవడం జరిగింది.వారు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. వారి కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ 4,96,006/- రూపాయలు కంపెనీ డీజీ ఎం సురేష్ మరియు,డి ఎం రవి ద్వారా నామిని అయినటువంటి భార్య బోరే భాగ్యలక్ష్మికు అందజేశారు.ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్యనారాయణ స్వామి,పెంబి తహసిల్దార్ లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు స్వప్నిల్ రెడ్డి,డి ఎంరవి, సీనియర్ మేనేజర్ వినోద్ కుమార్ ఎంప్లాయిస్ బెనిట్, అశోక్,ప్రవీణ్,రమేష్ డెవలప్మెంట్ ఆఫీసర్ నల్ల దేవేందర్, సుధాకర్, వేణు గౌడ్ మరియు సేల్స్ ఆఫీసర్స్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వివో భవనం నిర్మాణం కోసం భూమి పూజ



**చురకలు విలేఖరి వీణవంక మార్చి 09 :** వీణవంక మండల కేంద్రంలో సోమవారం వెలుగుబాట వివో భవనం నిర్మాణం భూమి పూజకి ముఖ్యఅతిథిగా సర్పంచ్ దాసారపు సరోజన పాల్గొని కొబ్బరికాయ కొట్టి భూమి పూజ నిర్వంచినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల కోసం పక్కా భవనం కోసం 10 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగిందనీ తెలిపారు.ఈ భవనం మహిళా సంఘం సభ్యులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్లపెల్లి మహేందర్ గౌడ్, ఏఈ పి ఆర్ లోహిత్ రెడ్డి, ఏపిఎం సుధాకర్,సీసీలుఆనంద్, ఘనశ్యామ్, వార్డు సభ్యులు నీల శ్రీకాంత్,వివో అధ్యక్షులు, వివోఏ లు పాల్గొన్నారు.

## చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలి

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 9 :** రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మరియు రామగుండం మేయర్ మహంకాళిస్వామి గీతాంజలి హై స్కూల్ లో నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ముందుకు రావాలని సూచించారు.

# సివిల్స్ ర్యాంకర్‌కు జియంలు అభినందనలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 9 :** ఇటీవల ప్రకటించిన యూపీఎస్సీ పరీక్ష ఫలితాలలో అఖిల భారత స్థాయిలో 55వ ర్యాంకును సాధించిన గూడెల్లి సృజనకు రామ గుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావులు అభినంద నలు తెలియజేశారు.సోమవారం జీఎం కార్యాలయం నందు జరిగిన కార్య క్రమంలో ఆమె తల్లిదండ్రులు గూడెల్లి రాజేశం- రాణిలను జిఎంలు శాలువా తో సత్కరించి,పుష్పగుచ్ఛా నీ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన సింగరేణి ఉద్యోగి కూతురు సివిల్స్ లో ర్యాంక్ సాధించడం చాల సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి దేశ సేవ చేయాలని ఆకాంక్షిం చారు.అలాగే నేటి యువత ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.తదుపరి సృజన తల్లిదండ్రులకు కార్పొరేట్ జనరల్ మేనేజర్ (పర్సనల్, ఐఆర్ అండ్ పియం) కవిత నాయుడు వారికి ఫోన్‌చేసి అభినందలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్వోటుజిఎంలు యం. రామ్మోహన్, బండి సత్య నారాయణ, విభాగాధిపతులు బి.టి.మురళీ కృష్ణ, బి.వి.సత్య నారాయణ, సుదర్శనం, సి.జె.సురేఖ, ఐలయ్య తో పాటు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి కృషి

**మొదటి పేజీ తరువాయి....** అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మైనారిటీ మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలపడాలని ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. కుట్టు మిషన్ల పంపిణీ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను ప్రదర్శిస్తూ ఆదాయం పొందాలని సూచించారు. ఇంటి వద్ద నుంచే ఉపాధి పొందే అవకాశంగా కుట్టు పనిని అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడటంతో పాటు మహిళలకు గౌరవం కూడా పెరుగుతుందని తెలిపారు. గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లి అనుకోని పరిస్థితుల్లో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా సహాయం అందజేయడం ద్వారా వారికి కొంత ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లాలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు కూడా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని తమ జీవితాలను మెరుగుపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా మైనారిటీ అధికారి చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

### సైబర్ మోసాలకు గురైతే వెంటనే
## 1930కి ఫిర్యాదు చేయాలి

**మొదటి పేజీ తరువాయి....** భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.అలాగే ఫేక్ సోషల్ మీడియా ప్రొఫైల్‌ల ద్వారా జరుగుతున్న మోసాలపై కూడా అవగాహన కల్పించారు. ఇతరుల పేరుతో నకిలీ ఖాతాలను సృష్టించి డబ్బులు అడగడం, వ్యక్తిగత వివరాలు సేకరించడం వంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. అందువల్ల సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు. విదేశాల్లో ఉద్యోగం, గిఫ్ట్ పంపిస్తున్నామని చెప్పి డబ్బులు అడిగే మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా ఫిషింగ్ లింకులు పంపించి డేటా దొంగిలించడం, ఓటీపీలు తీసుకోవడం వంటి సైబర్ మోసాల గురించి కూడా వివరించారు. సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించడం, ప్రైవసీ సెట్టింగ్స్‌ను సరిచేసుకోవడం, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకపోవడం వంటి భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని, వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపారు. బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే సమాచారం అందిస్తే మోసపోయిన డబ్బులను తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమం అనంతరం విద్యార్థినులు అడిగిన వివిధ సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. సైబర్ నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచిస్తూ విద్యార్థినులతో సైబర్ క్రైమ్ అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. సైబర్ భద్రతపై అవగాహన పెంచేందుకు పోస్టర్ ప్రెజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, సైబర్ క్రైమ్ ఎస్.ఐ లు కృష్ణ, దినేష్, టౌన్ ఎస్.ఐ సుప్రియా, కళాశాల సిబ్బంది, కళా బృంద సభ్యులు,సుమారు 250 మంది నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

### గోదావరి నది తీరంను
## పరిశీలించిన కలెక్టర్

**మొదటి పేజీ తరువాయి....** రానున్న నేపథ్యంలో గోదావరి నది తీరంలో పారిశుధ్యం మరియు స్నాన ఘాట్ల పనులపై తగిన శ్రద్ధ వహించి భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం ధర్మపురి పట్టణ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఒ.పి. సేవలు, ఐపీ సేవలు రికార్డ్స్ ల్యాబ్ రికార్డ్స్ ఐపీ రికార్డ్స్ మెడికల్ ఫార్మసి పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆసుపత్రిలో వైద్య సేవలను గురించి నేరుగా పేషంట్లని వివరాలు అడిగి తెలుసుకున్నారు.వైద్య సేవలు మెరుగు పరచాలని డాక్టర్లు సమయ పాలన పాటించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రోజుకు ఎన్ని ఓ.పి.లను చూస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు.సామాజిక ఆరోగ్య కేంద్రంలో ముందస్తు వ్యాధుల పట్ల డెంగ్యూ వైరల్ ఫీవర్లకు మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్స్పైర్ అయినటువంటి మెడిసిన్ ఉండకుండా చూసుకోవాలన్నారు. డాక్టర్లను వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని వున్న మంచినీటి సౌకర్యాలను ఎప్పటికప్పుడు నాణ్యతమైన వంట సామాగ్రి మంచి భోజనం అందించాలి ఆదేశించారు. ఈ పరిశీలనలో రెవెన్యూ డివిజనల్ అధికారి మధు సూదన్, జిల్లా ఆస్పత్రి కోఆర్డినేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ , మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వో, ఆస్పత్రి సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లిలో ఫుణ కోషి చోటోకాన్ కరాటే బెల్ట్ టెస్ట్ నిర్వహణ

**చురకలు ప్రతినిధి కోరుట్ల మార్చ్,09 :** మెటుపల్లి పట్టణంలోని పవన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఫుణకోషి శోటోకన్ కరాటే బెల్ట్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించరు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లాకు చెందిన సుమారు 300 మంది విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కరాటే బెల్ట్ టెస్ట్‌లో గ్రీన్‌వుడ్ పాఠశాల కు చెందిన 12మంది విద్యార్థులు పాల్గొని వివిధ బెల్టులను సాధించారు. వీరిలో శైమా మెహ్రీన్ (బ్రౌన్ బెల్ట్), అబ్దుల్ ముక్సిత్ (బ్రౌన్ బెల్ట్),షేక్ అమన్(మెరూన్ బెల్ట్),మహమ్మద్ అబూజర్ (మెరూన్ బెల్ట్),అఫీరా ఖానం (మెరూన్ బెల్ట్),ముస్కెల సుశ్రీత్ (గ్రీన్ బెల్ట్),సయ్యద్ అబ్దుల్ హదీ(ఆరెంజ్





బెల్ట్),అయాన్ అబ్రార్(ఎల్లో బెల్ట్), మహమ్మద్ ఆదియా(ఎల్లో బెల్ట్), మహమ్మద్ నేహాల్ (ఎల్లో బెల్ట్), మీర్జా అర్హాన్ బెగ్ (ఎల్లో బెల్ట్), మీర్జా తైమూర్ బెగ్ (ఎల్లో బెల్ట్) బెల్టులను సాధించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ కనకతార, మెటుపల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబ్రాది, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్ , 16వ వార్డు కౌన్సిలర్ హరిశే వనజ మురళి



హాజరయ్యారు. అలాగే రచ్చ శ్రీనుబాబు (బ్లాక్ బెల్ట్ 7వ డాన్), గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ టెక్నికల్ డైరెక్టర్ ఇండియా, ఎగ్జామినర్ ఆరుముల్ల పవన్ (బ్లాక్ బెల్ట్ 5వ డాన్), పీఈటీ ఆల్ రౌండర్ గంగాధర్, గ్రీన్ వుడ్ పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ మోయిస్, కోరుట్ల కరాటే కోచ్ ఆకాష్ (3వ డాన్), మెటుపల్లి కరాటే కోచ్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యసాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

**చురకలు ప్రతినిధి కోరుట్ల, మార్చి 8 :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరుట్ల పట్టణం లోని మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులను నిత్యసాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో ఆదివారం ఘనంగా సత్కరించారు. సమాజ సేవలో భాగంగా మహిళా కార్మికుల కృషిని గుర్తిస్తూ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ కోరుట్ల ఇంచార్జీ సుమ మాట్లాడుతూ నిత్యసాయి ఛారిటబుల్ ట్రస్ట్ యొక్క ప్రధాన లక్ష్యాలను వివరించారు.నిరుపేదలకు



అండగా నిలవడం,విద్యా మరియు వైద్య రంగాల్లో సహాయం అందించడం, సమాజంలో చైతన్యం కలిగించడం ట్రస్ట్ ధ్యేయమని పేర్కొన్నారు.భవిష్యత్తులో చేపట్టబోయే సేవా కార్యక్రమాల గురించి కూడా కార్మికులకు వివరించారు. వేడుకల్లో భాగంగా మహిళా కార్మికుల తో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారికి గౌరవార్థం వెజ్ భోజనాన్ని ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ పట్టణ పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న మహిళల సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు.కార్యక్రమం ముగింపులో మహిళా కార్మికులకు ట్రస్ట్ తరపున సభ్యత్వ కార్డులను అందజేశారు.ఈ కార్డుల ద్వారా భవిష్యత్తులో ట్రస్ట్ నుండి అందే వివిధ రకాల సహాయ సహకారాలను పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది,ట్రస్ట్ సభ్యులు,మహిళా కార్మికులు పాల్గొన్నారు.

# కోరుట్లలో ఘనంగా '2కె రన్'

## -భాగస్వాములైన చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, యువత



**చురకలు ప్రతినిధి కోరుట్ల,మార్చి 09 :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక 99రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం ఉదయం కోరుట్ల పట్టణంలో '2ఖ రన్'ను ఉత్సాహంగా నిర్వహించారు.ఈ పరుగును స్థానిక కృష్ణా మందిరం వద్ద ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్,మున్సిపల్ కమిషనర్ గుండా రవీందర్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు,పురపాలక సంఘం సిబ్బంది,పట్టణ ప్రముఖులు,యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి వార్డులో శ్రమదానం కార్యక్రమాలు నిర్వహించి,ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని కౌన్సిలర్లకు సూచించారు.మున్సిపల్ కమిషనర్ గుండా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ కోరుట్లను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రజలు తమ ఇళ్ల వద్దే తడి,పొడి హానికర చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు.అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి,మార్కెట్‌కు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ బట్ట సంచులు ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు.

# వెంపేట్‌లో పారిశుద్ధ్య పనులు

**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్, మార్చి 9 :** 99 రోజుల ప్రజాపాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా మండలం లోని వేంపేట్ గ్రామంలో పల్లె ప్రకృతి వనం



పరిసరాల్లో శుభ్రత కార్యక్రమాన్ని జరిపారు.ఇందులో సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్,ఉపసర్పంచ్ అల్లూరి సురేందర్ రెడ్డి, వార్డు మెంబర్లు కార్యదర్శి పాకాల రాజు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ధర్మపురి క్షేత్రంలో భక్తజన సందోహం

## -అవధులు దాటిన భక్తి పారవశ్యం

**రామ కిష్టయ్య సంగన భట్ల....**

దక్షిణ కాశీగా, హరిహర క్షేత్రంగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్ట మైన రాష్ట్రంలో సుప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా, గోదావరి తీరస్థ పవిత్ర తీర్థంగా పేరెన్నికగన్న ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ నర సింహ (ఉగ్ర, యోగానంద, శ్రీ వెంకటేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమ వారం ధర్మపురి పట్టణంలో భక్తి పారవశ్యం అవధులు దాటింది. "తడి బట్ట స్నానాలయ్యో నరసయ్యా, నీ గుళ్ళో పూజలయ్యో, చంకనా బాలాలయ్యో నరసయ్యా, నెత్తిమీద ముళ్ళాలివిగో; గండి దాటి మేమొస్తిమో నరసయ్యా, గట్టెక్కించి మమ్ము దోలవో" అంటూ జానపద బాణీలలో రాష్ట్రేతర ప్రాంతాల నుండి ఏతెంచిన భక్తుల భగవన్నామ స్మరణలతో, గీతాలా పనలతో క్షేత్రం మారు మోగింది. ఔరంగాబాద్, చంద్రాపూర్, నాందేడ్ లాంటి సుదూర ప్రాంతాల నుండి ప్రత్యేక మరియు ఆర్టీసి బస్సులలో



ప్రాచీన వంశ పారంపర్య ఆచార క్రమంలో వచ్చిన భక్తులు పవిత్ర గోదావరి నదిలో మంగళ స్నానాలు ఆచరించి, దర్శనార్థం ఆలయాల ముందు వేచి నిలుచున్నారు. ప్రధానాలయాలలో పంచోపనిషత్ యుక్త ప్రత్యేక పూజలు, నిత్య కళ్యాణ, ప్రత్యేక పూజలు దేవస్థాన ఆస్థాన వేద పండితులు రమేశ్ శర్మ, నంబి శ్రీనివాసాచార్య, నేరెళ్ల శ్రీనివాసా చార్య, నరసింహ మూర్తి, రమణాచార్య, అశ్విన్, వంశీ, విజయ్, కిరణ్, వామన్, మోహన్, ప్రవీణ్, సంబంధిత ఆలయాల అర్చకులు, దేవ స్థానం ఎసి, ఈఓ శ్రీనివాస్, కమిటీ చైర్మన జక్కు రవీందర్, సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించారు. ముఖ్యంగా కోరిన కోర్కెలు తీర్చే ప్రధాన దైవమైన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ ఏకాంత ఉత్సవ సందర్భంగా మూల విరాట్టులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

**దేవస్థానంలో మెక్కులు తీర్చుకున్న భక్తులు**

బ్రహ్మోత్సవాలలో అంతర్భాగంగా సోమ వారం వంశపారంపర్య ఆచార ఆచరణ నేపథ్యంలో రాష్ట్రం నలుమూలల నుండే కాక, మహారాష్ట్ర తదితర సుదూర ప్రాంతాల నుండి ఎతెంచిన భక్త జనం దేవస్థానంలో మెక్కులు తీర్చుకున్నారు. రథోత్సవ అనంతరం నిర్వహించే స్వాముల ఏకాంతోత్సవ వేడుకలలో భాగస్వాములు కావడం సనాతన సాంప్రదాచారణ కాగా, సుదూర ప్రాంతాలనుండి ఏటా సాంప్రదాయాలను ఆచరిస్తున్న భక్తులు పిల్లా పాపలతో గోదావరి నదికి మూటా ముళ్ళే నెత్తిన పెట్టుకు వచ్చిన భక్తులు, మంగళ స్నానాలను ఆచరించి, గోదావరి మాతను అర్చించి, దాన ధర్మాలను ఆచరించి, వివిధ ఆలయాలలో దైవ దర్శనాలు చేసుకున్నారు. ప్రధానంగా నారసింహ ప్రధానాలయంలో కోడె మెక్కులు, గండా దీపం, పట్టే నామాలు, కోరమీసాలు తదితర మెక్కులు తీర్చుకుని, స్వామి సన్నిధిలో తమ కోర్కెలు తీరా లని ముడుపులు కట్టారు.

**గోదావరిలో ఘనంగా చక్ర తీర్థం**

శ్రీయోగానంద, ఉగ్ర నారసింహ, శ్రీవేంకటేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆది వారం రాత్రి గోదావరి నదిలో స్వామి వారల చక్రతీర్థం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



ముప్వురు స్థానిక దైవాల రథాలను ప్రధాన రహదారి గుండా నంది విగ్రహ చౌరస్తా వరకు ఊరేగింపు జరిపిన అనంతరం రాత్రి 8.30 గంటలకు మంగళ వాద్యాలు, వేద మంత్రాల మధ్య స్వాముల ఉత్సవ విగ్రహాలను గోదావరి నది పైభాగం వరకు భక్త జనం తోడురాగా తీసుకవెళ్ళి నదినీటి సమీపాన ఆసీనుల గావించారు. అవభృత స్నానాలు ఆచరించిన అనంతరం స్వాములకు షోడశో పచార పుజలు గావించారు. స్వాముల పాదాలు స్పృశించిన నదీజలాలను భక్తులపై సంప్రోక్షణగా వించారు. దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ , కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్, దేవస్థాన యాజ్ఞికులు పురుషోత్తమా చార్య, ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, వివిధ ఆలయాల అర్చకులు, వేద పండితులు, దేవస్తాన కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, కమిటీ బాధ్యులు, సిబ్బంది, భక్తులు యేడాదికో సారి మాత్రమే రథోత్సవం నాటి రాత్రి నిర్వహించే అపురూప కార్యక్రమంలో భాగస్వాములైనారు. ఆ తర్వాత సాంప్రదాయాచణ ప్రకారం మధ్వాచారి వంశజుల ఇళ్ళలో పూజలందుకుని, రాత్రి విందు భోజనం ఆరగించి, ఊరేగింపుగా దేవస్థానానికి తిరిగి వచ్చిన అనంతరం పుష్పయాగం కార్యక్రమాన్ని నిర్వహించి, దైవాలను కీర్తించారు. సంతాన ఫలాపేక్ష గలిగిన వారికి మాల ధారణగా వించారు. సి ఐ రాం నర్సింహా రెడ్డి,ఎస్ ఐ మహేష్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

# శాతవాహనుల జ్ఞాపకాలు దాచుకున్న సప్త గోదావరి తీరం

## -వేల ఏళ్ల చరిత్రను మేల్కొలిపిన డాక్టర్ నర్సయ్య ప్రసంగం

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**



జగిత్యాల జిల్లా లోని మల్లాపూర్ మండలంలోని వేంపల్లి గ్రామం చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాచీన క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. సప్తగోదావరి తీరాన ఆవాసం ఏర్పరుచుకున్న ఈ గ్రామం కేవలం ఒక సాధారణ పల్లె కాదు; వేల ఏళ్ల చరిత్రను మోస్తున్న సంస్కృతి--సంప్రదాయాల నిలయం. గోదావరి మహానది ఇక్కడ ఏడు పాయలుగా చీలి ప్రవహిస్తూ ప్రకృతి వైభవాన్ని ఆవిష్కరించే అరుదైన భౌగోళిక దృశ్యాన్ని సృష్టించింది. ఈ కారణంగానే వేంపల్లి ప్రాంతం గతంలోనే కాక ఇప్పటికీ చరిత్రకారుల, పరిశోధకుల దృష్టిని ఆకర్షిస్తున్నది. ఇటీవల ఈ ప్రాంత చారిత్రక ప్రాముఖ్యతను గుర్తుచేసే ఒక స్ఫూర్తిదాయక కార్యక్రమం గ్రామంలో జరిగింది.గ్రామ సర్పంచ్ రాజేందర్ ఆధ్వర్యంలో,పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ జరీనా,హెచ్ ఎం దత్తాత్రి సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంగన భట్ల దత్తాత్రి,హరిబాబు,ఉపాధ్యాయులు, సిబ్బంది,విద్యార్థులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రముఖ చారిత్రక పరిశోధకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ సంగన భట్ల నర్సయ్య ప్రధాన అతిథిగా పాల్గొని వేంపల్లి ప్రాంత చారిత్రక నేపథ్యంపై విశదంగా ప్రసంగించారు.ఈ సందర్భం గా డాక్టర్ నర్సయ్య చేసిన ప్రసంగం గ్రామస్థులను మాత్రమే కాకుండా విద్యార్థుల్లోనూ చరిత్ర పట్ల ఆసక్తిని రేకెత్తించింది.చరిత్ర అనేది కేవలం గతాన్ని వివరించే కథనం మాత్రమే కాదని,ఒక ప్రాంత అస్తిత్వాన్ని,ఆ ప్రాంత ప్రజల సంస్కృతిని,జీవన విధానాన్ని తెలియజేసే గొప్ప పత్రిక అని ఆయన వివరించారు.ఒక ప్రాంత చరిత్రను అర్థం చేసుకోవడం ద్వారా ఆ ప్రాంతపు సంస్కృతి,ఆర్థిక వ్యవస్థ,సామాజిక పరిణామాలను కూడా తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.వేంపల్లి వంటి గ్రామాలు భౌగోళికంగా చిన్నవిగా కనిపించినా,చరిత్రలో అవి గొప్ప పాత్ర పోషించాయని ఆయన స్పష్టం చేశారు.

గోదావరి మహానది భారతదేశపు గొప్ప నదుల్లో ఒకటి. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో ఈ నది వేల ఏళ్లుగా కీలక పాత్ర పోషిస్తోంది.వేంపల్లి పరిసర ప్రాంతంలో గోదావరి ఏడు పాయలుగా విభజించి ప్రవహించడం విశేషం.ఈ కారణంగానే ఈప్రాంతాన్ని "సప్తగోదావరి"గా పిలుస్తారు. ఈ ఏడు ప్రవాహాలు కలిసిన ప్రాంతం గతంలో సహజమైన ఓడరేవుగా అభివృద్ధి చెందినట్లు చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయని డాక్టర్ నర్సయ్య వివరించారు.నదీ మార్గం ద్వారా వ్యాపారం జరిగే కాలంలో ఇలాంటి సహజ నౌకాశ్రయాలు వ్యాపారానికి ప్రధాన కేంద్రాలుగా ఉండేవని ఆయన పేర్కొన్నారు.ప్రాచీన కాలంలో ఈ ప్రాంతం ఒక ప్రముఖ వ్యాపార కేంద్రంగా ఉన్నట్లు అనేక పురావస్తు సూచనలు వెల్లడిస్తున్నాయని ఆయన చెప్పారు.ముఖ్యంగా ఇక్కడ వేల సంవత్సరాల క్రితం ఉక్కు తయారీ కేంద్రాలు ఉండేవని పరిశోధకులు గుర్తించినట్లు ఆయన వివరించారు. దక్షిణ భారతదేశంలో ఉక్కు తయారీకి ప్రత్యేకఖ్యాతి ఉన్నకాలంలో ఈ ప్రాంతం కూడా ఆ పరిశ్రమలో ప్రముఖ పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ తయారైన ఉక్కు ఇతర ప్రాంతాలకు,విదేశాలకు కూడా తరలించబడినట్లు చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయని ఆయన వివరించారు.ఉక్కు తయారీతో పాటు నదీ మార్గం ద్వారా జరిగే వ్యాపారం కారణంగా ఈ ప్రాంతం ఒక ప్రముఖ ఓడరేవుగా అభివృద్ధి చెందిందని ఆయన చెప్పారు.చరిత్రలో రెండు వేల సంవత్సరాల క్రితం దక్షిణ భారతదేశంలో ప్రభావవంతమైన వంశంగా శాతవాహనవంశం నిలిచింది.ఆ వంశానికి చెందిన రాజులు రాజకీయ పరిపాలనతో పాటు సాహిత్య, సాంస్కృతిక రంగాలకు కూడా విశేష సేవలు అందించారు.శాతవాహన వంశానికి చెందిన గొప్ప పాలకుల్లో హాల చక్రవర్తి ప్రత్యేక స్థానం కలిగిన వారు.ఆయన కేవలం పరిపాలకుడు మాత్రమే కాకుండా గొప్ప కవి కూడా.

ప్రాకృత భాషలో రచించిన "గాథా సప్తశతి" అనే ప్రసిద్ధ గ్రంథం ఆయన సాహిత్య ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది.ప్రేమ,ప్రకృతి,గ్రామీణ జీవితం వంటి అంశాలను సున్నితంగా ప్రతి బింబించే ఈ కవితా సంపుటి భారతీయ సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించింది.డాక్టర్ నర్సయ్య తన ప్రసంగంలో హాల చక్రవర్తితో ఈ ప్రాంతానికి ఉన్న సంబంధాన్ని ప్రత్యేకంగా వివరించారు. ప్రాచీన కాలంలో బాదనకుర్తి ప్రాంతానికి చెందిన లీలావతి అనే యువతిని హాలచక్రవర్తి వివాహం చేసుకున్నట్లు చారిత్రక కథనాలు తెలియజేస్తున్నాయని ఆయన చెప్పారు. ఆ వివాహం గోదావరి తీరాన గల ప్రాచీన బీమేశ్వర ఆలయంలో జరిగినట్లు స్థానిక సంప్రదాయాలు, చారిత్రక సూచనలు పేర్కొంటున్నాయని ఆయన వివరించారు.ఈ సంఘటన వల్ల ఈ ప్రాంతానికి ఒక ప్రత్యేక చారిత్రక గుర్తింపు ఏర్పడిందని ఆయన అన్నారు.వేంపల్లి పరిసర ప్రాంతంలో గల బీమేశ్వర ఆలయం కూడా చారిత్రకంగా ప్రాముఖ్యత కలిగిన క్షేత్రంగా గుర్తించబడుతోంది.గోదావరి తీరాన ఉన్న ఈ ఆలయం పూర్వకాలంలో ప్రాంతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా ఉండేదని పరిశోధకులు భావిస్తున్నారు.నదీ తీర ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణం సాధారణంగా ఆ ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక జీవనానికి మాత్రమే కాకుండా వ్యాపార, సామాజిక కార్యకలాపాలకు కూడా కేంద్రాలుగా ఉండేవని ఆయన వివరించారు.అలాంటి సందర్భంలో బీమేశ్వర ఆలయం కూడా ఆ కాలంలో ముఖ్యమైన ఆధ్యాత్మిక--సామాజిక కేంద్రంగా ఉండి ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ ప్రాంత చారిత్రక నేపథ్యాన్ని పరిశీలించినప్పుడు వేంపల్లి కేవలం ఒక గ్రామం మాత్రమే కాకుండా ఒక పురాతన నాగరికతకు నిలయంగా నిలిచిందని చెప్పవచ్చు.నదీ తీర ప్రాంతాలు సాధారణంగా మానవ నివాసాల అభివృద్ధికి అనుకూలంగా ఉండటంతో పాటు వ్యవసాయం, వ్యాపారం,రవాణా వంటి రంగాలకు కూడా అనుకూలంగా ఉంటాయి. గోదావరి వంటి మహానది సమీపంలో ఉన్నందున వేంపల్లి ప్రాంతం కూడా గతంలో ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా ఉండి ఉండవచ్చని చరిత్ర కారులు భావిస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాజేందర్ మాట్లాడుతూ వేంపల్లి ప్రాంత చారిత్రక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడానికి ఇలాంటి కార్యక్రమాలు అవసరమని అన్నారు. పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ జరీనా కూడా విద్యార్థుల్లో చరిత్రపై ఆసక్తిని పెంపొందించడానికి పాఠశాల స్థాయిలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు సంగన భట్ల దత్తాత్రి, హరిబాబు తదితరులు కూడా ఈ కార్యక్రమం విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.చరిత్ర అనేది ఒక ప్రాంతానికి జీవంతమైన గుర్తింపు. ఆ గుర్తింపును కాపాడుకోవడం ప్రతి తరానికి బాధ్యత.వేంపల్లి వంటి గ్రామాలు చరిత్రలో ఉన్నగొప్ప సంపదను మనకు గుర్తుచేస్తాయి. నదీ తీర ప్రాంతాల్లో పుట్టుకొచ్చిన నాగరికతలు, వ్యాపార కేంద్రాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు మన సంస్కృతిని నిర్మించడంలో కీలకపాత్ర పోషించాయి. అలాంటి చారిత్రక సంపదను గుర్తించి, దాన్ని పరిశోధించి, భవిష్యత్ తరాలకు అందించడం ద్వారా మనం మన వారసత్వాన్ని నిలబెట్టుకోవచ్చు. కార్యక్రమం ముగింపులో డాక్టర్ సంగన భట్ల నర్సయ్యను గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఆయన చారిత్రక పరిశోధనలకు, ప్రాంతీయ చరిత్రను వెలికితీసే కృషికి కృతజ్ఞతగా సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనకు శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రామ చరిత్రను వెలుగులోకి తీసుకు వచ్చే ప్రయత్నాలకు ఆయన అందించిన మార్గదర్శకత్వాన్ని అందరూ ప్రశంసించారు.వేంపల్లి వంటి గ్రామాల చరిత్రను పరిశోధించి ప్రజలకు తెలియజేయడం ఎంతో అవసరం.ఈ నేపథ్యంలో వేంపల్లి గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమం చరిత్రపట్ల అవగాహన పెంచడంలో ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది. గ్రామ చరిత్రను గుర్తించి, దాన్ని గౌరవించి,భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో ప్రజలు ముందుకు సాగితే వేంపల్లి వంటి చారిత్రక క్షేత్రాలు మరింత ప్రాధాన్యతను పొందడం అనివార్యం.

## ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ కరాటే ఎంతో దోహదపడుతుంది

**-రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్**



**చురకలు విలేకరి,రాయికల్,మార్చి 9 :** ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్, కరాటే ఎంతో దోహదపడుతుందని మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ అన్నారు.ది ఇంటర్నేషనల్ హుయాన్ చుంగ్ నింజాస్ మార్షల్ ఆర్ట్స్ డ్రాగన్ స్వార్డ్ కుంగ్ ఫు అకాడమీ తెలంగాణ రాష్ట్రస్థాయిలో జగిత్యాల జిల్లా ధర్మపురిలో జరిగిన 5వ రాష్ట్ర స్థాయి కుంగ్ ఫు,కరాటే ఛాంపియన్ షిప్ -2026 రాయికల్ పట్టణానికి చెందిన ముక్కెర శ్రీచందన,గంగాధరి హన్షిత్,కండ్లపల్లి శశాంక్ చందోలి ప్రణీత, శ్రీపెరుమండ్ల విహారిలు బంగారు పతకాలు,వేల్పుల సాత్విక్, యశోద సాహిత్య, పెరుమండ్ల విశ్వశ్రీలు వెండి పతకాలు, ఇంద్రాల చైత్రిక,వేల్పుల ప్రహర్షిత, స్తంభం నిత్యలు విద్యార్థులు బంగారు పథకం ప్రశంస పత్రం సాధించగా విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్ పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పురె శ్రీధర్,నాయకులు తురగ శ్రీధర్,అడ్వకేట్ మచ్చ శేఖర్,బత్తిని నాగరాజు,కునారపు భూమేష్,వేముల రాము,కరాటే మాస్టర్ కనుక ప్రభాకర్,హెడ్‌కానిస్టేబుల్ అర్జున్,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శంఖుస్థాపనలో ప్రోటోకాల్ విస్మరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**-బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్**

**చురకలు విలేకరి,మల్లాపూర్,మార్చి 9 :** మహిళా సంఘ భవనాన్ని నిర్మించడానికి శంఖుస్థాపనలో కాంగ్రెస్ నాయకులు ప్రోటోకాల్ విస్మరించడం సరికాదని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, రాఘవపేట గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 6న మల్లాపూర్ మండల కేంద్రంలో ఏవో కార్యాలయం వద్ద ఈజీఎస్ నిధుల నుంచి రూ.50లక్షలతో నిర్మించనున్న ఐదు మహిళా సంఘ భవనాలకు స్థానిక మండల స్థాయి అధికారులతో కలిసి కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డా. సంజయ్ శంకుస్థాపన చేశారు. మహిళల నుంచి ఎమ్మెల్యేకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే భూమి పూజ చేసిన చోట కాకుండా ఎంఈవో కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగా రావు మహిళా సంఘ భవనాల నిర్మాణాలకు భూమి పూజ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎలాంటి ప్రోటోకాల్ లేని కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జీతో ఎలా భూమి పూజ చేయిస్తారో పాల్గొన్న అధికారులే మండల ప్రజలకు జవాబివాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే కు పిర్యాదు చేయగా జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇలాంటి ప్రోటోకాల్ ను విశ్వమరిస్తే రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

**చురకలు విలేకరి, ఇబ్రహీంపట్నం, మార్చి 9 :** మల్లాపూర్ మండలంలోని గుండంపల్లి ఒర్రె నుండి ఇబ్రహీంపట్నంకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశామని ఇబ్రహీంపట్నం ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు. ఇబ్రహీంపట్నం జిపివో తిరుపతి ఫిర్యాదు మేరకు రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి ట్రాక్టర్ల యాజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

## తండ్రి నుంచి ప్రాణాపాయం ఉందని కలెక్టర్‌కు ఫిర్యాదు

**చురకలు విలేకరి, వెల్గటూర్, మార్చి 9 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం సంకనపెల్లికి చెందిన జెస్సికా అనే బాలిక, తన తండ్రి, సోదరుడి నుంచి ప్రాణాపాయం ఉందని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్కు ఫిర్యాదు చేసింది.తన తల్లి శకుంతలను తండ్రి సామెల్ రెండో వివాహం చేసుకున్నారని, పెళ్లిలో ఇచ్చిన బంగారం, వెండి కోసం తల్లిని శారీరకంగా, మానసికంగా వేధించి, ఇంట్లో నుంచి గెంటేశారని ఆమె వాపోయింది. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నానని, చదువుకు, ఇంటి గడవడానికి కష్టంగా ఉందని పేర్కొంది.




తండ్రి పేరు మీద ఉన్న భూమికి తమకు సంబంధం లేదని, చంపేస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో తెలిపింది.

## మాజీ జడ్పీ చైర్ పర్సన్ పరామర్శ

**చురకలు విలేకరి,బీర్‌పూర్,మార్చి 9 :** సారంగాపూర్ మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన చిన్నోజి రమేశ్-జ్యోస్న దంపతుల కుమారుడు పవన్ తేజ (10) బావిలో పడి మృతి చెందగా సోమవారం వారి కుటుంబ సభ్యులను మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట మండల అధ్యక్షుడు తేలు రాజు మాజీ పాక్స్ చైర్మన్ సాగి సత్యం రావు, నాయకులు జగన్ మదన్ సుంకం రమేష్ బండెల రమేష్ కొమురయ్య



గిరీష్ వంశీ బాబు తదితరులున్నారు.

# శాఖల వారీగా ప్రజావాణి దరఖాస్తుల సమీక్ష

**-జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**
**-ప్రజావాణికి 352 దరఖాస్తులు**

**చురకలు ప్రతినిధి కరీంనగర్ మార్చ్ 9 :** ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, శాఖల వారీగా సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ



అధికారులు ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ వెను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.వారి పరిధిలోలేని దరఖాస్తులను మరో శాఖకు బదిలీ చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రతి దరఖాస్తు పై విచారించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.శాఖల వారీగా దరఖాస్తుల పెండింగ్ అంశాన్ని సమీక్షిస్తానని తెలిపారు.దరఖాస్తులను తమ వద్ద పెండింగ్లో ఉంచవద్దని అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం 352 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో వృద్ధులు,దివ్యాంగులు కూర్చున్న చోటకే వెళ్లి జిల్లా కలెక్టర్ వారి నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, లక్ష్మి కిరణ్, ఆర్డిఓ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# పెళ్లి రోజున అవయవదాన ప్రతిజ్ఞ

**- ఆదర్శంగా నిలిచిన యువ దంపతులు**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 9 :** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సమీపంలోని ఖాజిపల్లి--ప్రగతినగర్‌కు చెందిన యువ దంపతులు కావలి ప్రియాంక--నరేష్ తమ వివాహ వార్షికోత్సవాన్ని సమాజహితంతో గుర్తుండిపోయేలా చేసుకున్నారు. సోమవారం తమ పెళ్లిరోజు సందర్భంగా మరణానంతరం నేత్రదానం, అవయవదానం చేయాలని ప్రతిజ్ఞ చేసి ఆదర్శంగా నిలిచారు. ఫోటో స్టూడియో నిర్వాహకులుగా ఉన్న



ఈ దంపతులు అవయవదానం కోసం అంగీకార పత్రాలపై సంతకం చేశారు. దంపతుల నుంచి ఆ పత్రాలను లయన్స్ క్లబ్ 320జి రీజన్-IX, జోన్-II ఐ విజన్ కోఆర్డినేటర్ లయన్ కోదాటి ప్రవీణ్, లయన్స్ క్లబ్ ఆఫ్ జ్యోతినగర్ ప్రగతి సెక్రటరీ లయన్ దొండపాటి మహేందర్ రెడ్డి స్వీకరించి, సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి, ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత కె.ఎస్. వాసుకు అందజేశారు. ప్రేమ వివాహం చేసుకుని ఆదర్శవంతంగా జీవిస్తున్న ఈ జంట తమ వివాహ వార్షికోత్సవం రోజున సమాజానికి మేలు చేసే నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లయన్ కోదాటి ప్రవీణ్, లయన్ దొండపాటి మహేందర్ రెడ్డి దంపతులను శాలువాతో సత్కరించి అభినందించారు. అలాగే వారికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 320జి రీజన్-IX, జోన్-II జోన్ చైర్‌పర్సన్ లయన్ నార్ల ప్రసాద్, ఫౌండేషన్ బాధ్యులు టి. శ్రవణ్ కుమార్, లింగమూర్తి, చంద్రమౌళి, వాసు తదితరులు దంపతులను అభినందించారు.

# ఇసుక ట్రాక్టర్ల యజమానులు ఏవరిని దోచుకోడంలేదు

**-పత్రికా ముఖంగా దోచుకుంటున్నట్లు నిరూపించాలి లేకుంటే ట్రాక్టర్ యజమానులందరువచ్చి మీ ఇంటికాడా కుసుంటారు**
**-ఇసుక ట్రాక్టర్ల యజమానుల సంఘం తరఫున రోడ్డ రామచంద్రం**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 09 :** ఇసుక ట్రాక్టర్ల యజమానులు దోసుకుంటున్నారని ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ నిరూపించాలి.లేకుంటే ట్రాక్టర్ యజమానులు అందరూ మీ ఇంటి కాడికి వచ్చి కూసుంటారని ఇసుక ట్రాక్టర్ల యజమానుల సంఘం తరఫున



రోడ్డ రామచంద్రం అన్నారు,సర్పంచ్ కొండ రమేష్‌ను సూటిగా ప్రశ్నిస్తున్న ఇయ్యల్ల ఇసుక కావాలని రాయించు కున్నాడు మేము తనికి ఫోన్‌చేస్తే మీకు ఇసుక ట్రాక్టర్ ట్రిప్పుకు 2500కంటే ఎక్కువ ఇవ్వ అని మాట్లాడుతుండు అంతేకాకుండా ఇసుక ట్రాక్టర్ యజమానులు తుంగలు దోసుకుంటు న్నారు ప్రజల రక్తము పీడించుకు తింటున్నారుఅని అంటుండు కాని మేము ఎవరిని పీడించుకొని తినలేదు మా బాధలు మా సాధలు చెప్పినం కానీ కొండ రమేష్‌లాగా మేము దోపిడీ చేస్తలేము అని రామచంద్రం ఆరోపించారు.కొండ రమేష్ ఈరోజు డ్రైనేజీ పట్టుకున్నాడు అంటే లాభం రాకుండానే వర్క్ చేస్తున్నాడా,కమ్యూనిటీ హాల్ కడుతుంటే లాభం రాకుండానే చేస్తున్నాడా,ఒక సీసీ రోడ్డు పోస్తున్నాడు అని అంటే అది లాభం లేకుండానే చేస్తున్నాడా అని ఆయన ప్రశ్నించారు,ఇయ్యాల్ల కష్టార్జితం బండ్లు కొనుక్కొని లేబర్‌కు ఎంత ఇయ్యాలనో ప్రజలకు తెలుసు లేబర్‌కు 500డ్రైవర్‌కు 1500 రూపాయలు ఇవన్నీ వంగ ట్రిప్ కు 200,300 మిగులుతాయి ట్రిప్పుకు అని ఆయన అన్నారు.ఈ రకంగా మేము పని చేస్తుంటే ఇస్క ట్రాక్టర్ యజమానులు ఎక్కడ దూసుకుంటు న్నారో చర్చలకు ఎక్కడికంటే అక్కడికి వస్తాం పత్రిక ముఖంగా రమేష్ నిరూపించాలి నిరూపించకుంటే రమేష్ ఇంటికి ట్రాక్టర్ యజమానులు అందరూ వచ్చి కూర్చుంటారు అని రామచంద్రం అన్నారు.ఇప్పటికైనా అటువంటి మాటలు మాట్లాడవద్దని ఫోన్లో నువ్వు మాట్లాడిన మాటలు రికార్డు అయి మావద్ద ఉన్నాయన్నారు. మూడు వేలకు ఒక ఇసుక ట్రాక్టర్ ట్రిప్పు ఇస్తే తమకు లాభమన్నారు. 2500కే ఒక ట్రాక్టర్ ట్రిప్పు ఇసుక వచ్చేటట్లు చూడాలి సర్పంచ్ రమేష్ గత మూడు రోజుల క్రితం గౌరవ కలెక్టర్ కు ఎమ్మార్వో గారికి ఇసుక ఇవ్వాలని విజ్ఞప్తి చేయగా మా మాటలు మన్నించి ఇసుక ఇచ్చినందుకు సర్పంచ్ రమేష్ ఆయన తరుపున గ్రామం తరపున ధన్యవాదాలు తెలిపారు.ఇట్టి ఇసుకతో గ్రామంలో సిసి రోడ్లు అంగన్వాడి భవనం పనులు ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఎవరి బాధలు వారికి ఉంటాయి అది సహజమేనన్నారు, ఇసుక ట్రాక్టర్ యజమానులు రొడ్డ రామచంద్రం మా మిత్రులేనన్నారు మా గ్రామానికి 2500 రూపాయలకు ఒక ట్రిప్పు ఇసుక వచ్చేటట్లు చూడాలని మంగళవారం ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఇవ్వాలని ఆయన రెవిన్యూ అధికారులను కోరారు.

## స్మశాన వాటికలో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 09 :** ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో ఈజీఎస్ నిధులు 25లక్షలతో వైకుంఠధామము స్మశాన వాటికలో సిసి రోడ్ల నిర్మాణానికి సోమవారం స్థానిక సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ ఉపసర్పంచ్ పొన్నాల మన్నెమ్మతో కలిసి భూమిపూజ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ మర్రి నారాయణరెడ్డి,వార్డు సభ్యులు సతీష్ మల్లేష్ పద్మ జ్యోతి ఆకుల రామచంద్రం కొండ వర్షా గౌడ్ పాశం హరీష్ అందె దేవరాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడ్ల శ్రీనివాస్ గోగూరి శ్రీనివాస్ రెడ్డి మర్రి శ్రీనివాస్ రెడ్డి పొన్నాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధిక శబ్దం వచ్చే బైక్ సైలెన్సర్లతో బైక్‌లు నడిపే వారిపై కఠిన చర్యలు

**-ఎస్ ఐ రాహుల్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 09 :** ద్విచక్ర వాహనాలను అధిక శబ్దాన్ని కలిగించే సైలెన్సర్లతో బైక్‌లను నడిపే వాహనదారులపై కేసులు నమోదు చేసిచట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని,వారి వాహనాలను సీజ్ చేస్తామని ఎల్లారెడ్డిపేట ఎస్సై కే.రాహుల్ రెడ్డి తెలిపారు.ఆదివారం అధిక శబ్దం చేస్తూ వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.ప్రతి వాహన దారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని,అందుకు విరుద్ధంగా నడుచుకునే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ రాహుల్ రెడ్డి హెచ్చరించారు.

## గ్రామాభివృద్ధి పురోగతి ప్రతి ఒక్కరి బాధ్యత



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 9 :** ఎలిగేడు మండలంలోని 12 గ్రామ పంచాయతీల వార్డు సభ్యుల శిక్షణ తరగతుల కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధ్యర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సేవల గురించి వార్డు సభ్యులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీడీవో భాస్కర్, ఎంపీ ఓ కిరణ్ మరియు జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త దయా అరుణ మరియు జెండర్ స్పెషలిస్టు జె. సుచరిత మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డ నుండి వృద్ధులకు అందుబాటులో ఉన్న సేవలు వాటి వినియోగం, గ్రామాభివృద్ధి గురించి అలాగే టోల్ ఫ్రీ నెంబర్లు 1098,181,155326,14567,15100, 112, 14416 వినియోగం గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలల రక్షణ మరియు సంరక్షణ సేవల గురించి ఐ సి పి ఎస్ సోషల్ వర్కర్ వి.శ్యామల వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎలిగేడు మండల అంగన్వాడీ సూపర్వైజర్ సూర్యకళ, అంగన్వాడీ టీచర్లు, ఎన్జీవో సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మరియు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టవద్దు

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**-ప్రజావాణికి 179 దరఖాస్తుల రాక**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 09 :** ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో పెట్టవద్దని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 179 దరఖాస్తుల



రాగా,వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి..వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ శాఖకు 53,గృహ నిర్మాణ శాఖకు 29,డీఆర్డీఓ-20,సంక్షేమ శాఖకు-14,జిల్లా పంచాయతీ కార్యాలయం,ఎండీ సెస్-12, ఉపాధి కల్పన శాఖ,వైద్య శాఖ,ఈఈ పీఆర్‌కు చొప్పున-04, పౌర సరఫరాల శాఖ, ఎస్సీ సంక్షేమ శాఖ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు మూడు చొప్పున-03,విద్యా శాఖ,ఈఈ ఆర్ అండ్ బీ,నీటి పారుదల శాఖ,మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, మిషన్ భగీరథకు రెండు చొప్పున,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా ప్రణాళిక అధికారి,జిల్లా వ్యవ సాయ అధికారి,ఎక్సైజు శాఖ, గిరిజన సంక్షేమ శాఖ,డీపీఆర్ఓ,పశు సంవర్ధక శాఖ,ఎస్పీ కార్యాలయానికి ఒకటి చొప్పున వచ్చాయి.ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్,ఆర్డీఓలు వెంకటేశ్వర్లు రాధాభాయి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో దరువు పాత్ర అభినందనీయం

**-టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 9 :** తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానాలు చేసుకున్న విద్యార్థుల త్యాగాలను ప్రపంచానికి చాటి చెప్పేలా కృషి చేయడమే కాకుండా,పాలకుల కళ్లు తెరిపించడానికి దరువు సాంస్కృతిక వేదిక చేసిన కృషి అభినందనీయమని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టి యు డబ్ల్యూ జే) రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ అన్నారు.ఈ సంస్థ ఉత్తమ సాహిత్యం,ఆలోచింపజేసే పాటలతో తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసిందని ఆయన కొనియాడారు.దరువు సాంస్కృతిక సంస్థ 25యేండ్లు పూర్తి చేసుకున్న సందర్భం లో,ఏప్రిల్‌లో నిర్వహించనున్న "దరువు జాతర" పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం నాడు హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విరాహత్ అలీ మాట్లాడుతూ ఇరవై ఐదెండ్ల క్రితం పోరాటాల గడ్డ సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పురుడు పోసుకున్న దరువు సంస్థ, ఉస్మానియా యూనివర్సిటీతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో వేలాది మంది విద్యార్థులకు ఉద్యమ




చైతన్యాన్ని అందించి, లక్షలాది మంది ప్రజల ఆదరాభిమానాలు చూరగొందని ఆయన అన్నారు.సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దరువు ఎల్లన్న మాట్లాడుతూ దరువు సాంస్కృతిక వేదిక ఏర్పడి 25 ఏళ్ళు పూర్తయిన నేపథ్యంలో 'దరువు జాతర' పేరిట ఏప్రిల్ 20న రవీంద్రభారతిలో భారీ సాంస్కృతిక సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు దరువు అంజన్న మాట్లాడుతూ,ఈ సభకు కళాకారులు , ఉద్యమకారులతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు వివరించారు.

# సమాజ సేవలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ ముందుండాలి

**-ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు తమ్మనవేని అంజి యాదవ్**

**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ మార్చి 09 :** సమాజ సేవలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ ముందుండాలని రాష్ట్ర అధ్యక్షుడు తమ్మన వేని అంజి యాదవ్ పిలుపునిచ్చారు.కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్ లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో అల్లు అర్జున్ ఫ్యాన్స్ ఉమ్మడి జిల్లా కమిటీలను



వేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,అల్లు అర్జున్ ఫ్యాన్స్ అంటే ఫ్యాన్స్‌కు మాత్రమే పరిమితం కాకుండా సమాజ సేవలోనూ ముందుండాలని సూచించారు.అనంతరం ఉమ్మడి జిల్లాల అధ్యక్షులను నియమించారు.కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా గువ్వ సంతోష్, వరంగల్ అధ్యక్షుడిగా అచ్చుకట్ల రమేష్, నిజామాబాద్ అధ్యక్షుడిగా బదావత్ నరేందర్,ఖమ్మం అధ్యక్షుడిగా ఎస్ కే సైదులు, ఆదిలాబాద్ అధ్యక్షుడిగా ఎండీ అక్బర్ నియమితులవ్వగా,వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయా జిల్లాల అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షుడిని శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు.

# చిచ్చర పిడుగు 'అయాన్ష్'

**-ఒకే రోజు రెండు మెడల్స్ సాధించిన కరాటే కిడ్**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (గోదావరిఖని) మార్చి 9 :** గోదావరిఖని తిలక్ నగర్ డౌన్ కు చెందిన రాకం శ్వేత-కిరణ్ కుమారుడు కరాటే కిడ్ అయాన్ష్(8) ఆదివారం జరిగిన 5వ రాష్ట్రస్థాయి ఓపెన్ ఇన్ ఆల్ స్టైల్ కుంగ్ ఫూ, కరాటే చాంపియన్ షిప్-2026, అంతర్ రాష్ట్రీయ కరాటే చాంపియన్



షిప్ -2026 టోర్నమెంట్స్ లో పాల్గొని ఒకే రోజు రెండు మెడల్స్ సాధించాడు. స్థానిక చంద్రశేఖర్ నగర్ లోని గుడ్ మార్నింగ్ గ్రామర్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న ఈ సూపర్ కిడ్ డ్రాగన్ షోటోకాన్ కరాటే క్లబ్ మాస్టర్ పి.చందు వద్ద కరాటేలో గత 5నెలలు గా శిక్షణ పొందుతున్నాడు. అయాన్ష్ పాల్గొన్న మొదటి టోర్నమెంట్స్ ఇవే కాగా..ఒకే రోజు వేర్వేరు చోట్ల జరిగిన రెండు టోర్నమెంట్స్ లో అత్యంత ప్రతిభ కనబరిచి రెండు మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్నాడు.ఆదివారం జగిత్యాల జిల్లా ధర్మపురిలో డ్రాగన్ స్వోర్డ్ కుంగ్‌ఫూ అకాడెమీ నిర్వహించిన 5వ రాష్ట్ర స్థాయి ఓపెన్ ఇన్ ఆల్ స్టైల్ కుంగ్ ఫూ, కరాటే చాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో కటాస్ విభాగంలో రజత పతకం సాధించగా,మంచిర్యాల జిల్లా రామకృష్ణా పూర్‌లో జెన్ షిటో ర్యూ కరాటే స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ రాష్ట్రీయ కరాటే చాంపియన్ షిప్ టోర్నమెంట్ లో ప్రతిభ కనబరిచి కాంస్యపతకం అందు కున్నాడు.కాగా 8సంవత్సరాల వయసు లోనే అత్యంత ప్రతిభ కనబరిచిన ఈ చిన్నారి భవిష్యత్ లో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పతకాలు అందుకోవా లని మాస్టర్ చందు, తల్లిదండ్రులు శ్వేత-కిరణ్ ఆకాంక్షించారు.

## జిల్లా లీగల్ చైర్మన్‌గా షబానా



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 9 :** కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ అడ్వకేట్ పెద్దపల్లి జిల్లా లీగల్ చైర్మన్ గ నియమిస్తూ ఉత్తర్వులను సోమవారం అందజేశారు. టి ఆర్ ఉమెన్ రైట్స్ & యాంటీ కరప్షన్ అసోసియేషన్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కర్మంగి మత్స్యరాజు నేషనల్ డైరెక్టర్ రావుల తిరుపతయ్య ఈమెను నియమించారు. ఈమె సంస్థ తరఫున ఉమెన్ రైట్స్ & అవినీతి నిరోధక సంస్థ టీం తరఫున పనిచేయడం జరుగుతుంది. తమపై నమ్మకంతో నియమించినందుకు షబానా వారికి ధన్యవాదాలు తెలిపారు. పేద ప్రజల కొరకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తారని షబానా పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు పోతుగల్ జెడ్పిహెచ్ఎస్ విద్యార్థి ఎంపిక



**చురకలు,విలేకరి, ముస్తాబాద్,మర్చి 09 :** ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి భుక్య తిరుపతి ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్--14 బాలుర ఎస్జిఎఫ్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.ఈనెల 7 నుండి 9వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొంటున్నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తడకల శ్యాంసుందర్ తెలిపారు.విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మామిండ్ల భూపతి గారు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు సురభి రాధాకిషన్ రావు గారు,రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్జిఎఫ్ కార్యదర్శి నర్రా శ్రీనివాస్ రెడ్డి గారు,ఉపాధ్యాయ బృందం, గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు గ్రామస్థులు అభినందించారు.

## యాంటీ డ్రగ్, రోడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్ కార్యక్రమాలపై అవగాహన



**చురకలు,విలేకరి, హుజూరాబాద్, మర్చి 09 :** హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏడు రోజుల స్పెషల్ ఎన్ఎస్ఎస్ క్యాంపు లో భాగంగా సోమవారం యాంటీ డ్రగ్, రోడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబర్ క్రైమ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుమల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ కు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఒక్కసారి డ్రగ్స్ అలవాటు పడితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అనారోగ్య సమస్యలు వస్తాయని అన్నారు. రోడ్ సేఫ్టీ విషయంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, హెల్మెట్ ధరించాలని రోడ్డు నియమ నిబంధనలను పాటించాలని కోరారు. సైబర్ క్రైమ్ విషయంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరగాళ్లకు దొరక్కుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్మాస్టర్ ప్రదీప్, మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ రజిత పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సరళ ఝాన్సీ పర్యవేక్షించగా, విద్యార్థులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల్లో భక్తి గానంగా మార్మోగిన నరహరి శతకం

## -భక్తి-సాహిత్య రసధారగా శేషప్ప శతక గానం





**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

ధర్మపురి క్షేత్రంలో సాహిత్య భక్తి పరిమళాలు మరోసారి గుబాళించాయి. శేషప్ప భక్త మండలి ఆధ్వర్యంలో, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల అంతర్భాగంగా నిర్వహించిన శేషప్ప శతక గాన కార్యక్రమం భక్తి, సాహిత్యం,సంగీతం సమ్మిళితమైన ఒక ఆధ్యాత్మిక సాంస్కృతిక వేడుకగా నిలిచింది. శేషప్ప కళా వేదికపై జరిగిన ఈ కార్యక్రమం కేవలం పద్య గానోత్సవంగా మాత్రమే కాకుండా, తెలుగు భక్తి సాహిత్య సంప్రదాయానికి గౌరవార్పణగా నిలిచింది.ధర్మపురి క్షేత్రానికి,శ్రీలక్ష్మీనరసింహస్వామి భక్తి సంప్రదాయానికి అంతర్భాగంగా నిలిచిన శేషప్ప కవిత్వాన్ని స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తజనులకు ఆధ్యాత్మికానందాన్ని కలిగించింది.కార్యక్రమం ప్రారంభానికి ముందు దేవస్థానం ప్రధాన ద్వారం సమీపంలో ప్రతిష్ఠించ బడిన శేషప్ప విగ్రహానికి ట్రస్ట్ బోర్డు చైర్మన్ జక్కు రవీందర్, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్ పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. శేషప్ప భక్తి సాహిత్య సంపదకు నివాళిగా నిర్వహించిన ఈ పుష్పాంజలి కార్యక్రమం అనంతరం భక్తులు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దేవస్థాన ప్రాంగణంలోని శేషప్ప కళావేదికపై ప్రధాన కార్యక్రమం సూపరింటెండెంట్ కిరణ్,సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ సహకారంతో ప్రారంభమైంది.కార్యక్రమంలో ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాస్,ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ్ శర్మలు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారికి ప్రత్యేక అర్చనలు, మంగళహారతులు సమర్పించి కార్యక్రమానికి ఆధ్యాత్మిక శోభను తీసుకు ఈవచ్చారు.అనంతరం శేషప్ప విరచిత శతకత్రయం సంబంధిత నరహరి శతక పద్యాలను గాయకులు గానం చేశారు.ఈ గాన కార్యక్రమం భక్తి భావాన్ని మరింతగా పెంపొందించింది.శేషప్ప పద్యాలలో నిక్షిప్తమైన భక్తి రసాన్ని గాయకులు స్వరపరిచిన తీరు సభికులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లింది.తెలుగు భక్తి సాహిత్యంలో శేషప్ప కవి విశిష్ట స్థానం పొందినవారు.ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిపై ఆయన రచించిన నరహరి శతకం,నృసింహశతకం, నృకేసరి శతకం వంటి భక్తి కవితా సంపద భక్తులలో ఇప్పటికీ అపారమైన ఆదరణ పొందుతోంది.భక్తి,తత్వం, భాషా మాధుర్యం,సరళమైన పద ప్రయోగం శేషప్ప పద్యాలకు ప్రత్యేకతను కలిగించాయి.భక్తుని హృదయ స్పందనలను ఆవిష్కరించే ఈ పద్యాలు శతాబ్దాలుగా పఠించబడుతూ వస్తున్నాయి.కార్యక్రమంలో పాల్గొన్న సాహితీవేత్త, శేషప్ప సాహితీ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగన భట్ల నర్సయ్య శేషప్ప జీవితం, కవిత్వం,ఆయన భక్తి భావం గురించి విశదీకరించారు.ధర్మపురి ప్రాంతానికి చెందిన శేషప్ప కవి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి భక్తుడిగా జీవితం గడిపారని ఆయన పేర్కొన్నారు.తన జీవితాన్ని స్వామివారి సేవకు అంకితం చేసిన శేషప్ప తన భక్తి అనుభూతులను పద్య రూపంలో వ్యక్తం చేశారని వివరించారు. శేషప్ప కవిత్వం కేవలంసాహిత్య సంపద మాత్రమే కాకుండా భక్తి మార్గంలో నడిచే వారికి మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు.డాక్టర్ నర్సయ్య శేషప్ప పద్యాలలోని భావ గాంభీర్యాన్ని సోదాహరణంగా వివరించారు. శేషప్ప పద్యాలలో నిక్షిప్తమైన భక్తి,తత్వం, నైతిక విలువలు,ఆధ్యాత్మికత గురించి ఆయన విపులంగా మాట్లాడారు.శ్రీలక్ష్మీ నరసింహస్వామిపై ఉన్న భక్తి ఎంత గాఢమైందో శేషప్ప పద్యాలలో స్పష్టంగా కనిపిస్తుందని ఆయన తెలిపారు.శేషప్ప పద్యాలు కేవలం పఠనానికి మాత్రమే కాకుండా భక్తి అనుభూతికి మార్గదర్శకమని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి కాకెర్ల దత్తాత్రి శేషప్ప పద్యాల పఠనాన్ని ప్రారంభించారు.ఆయన పఠించిన నరహరి శతక పద్యాలు సభికులను ఆకట్టుకున్నాయి.పద్యాలలోని భావాన్ని స్పష్టంగా వినిపించేలా ఆయన పఠనం సాగింది.ఈ సందర్భంగా పలువురు గాయకులు కూడా శేషప్ప పద్యాలను గానం చేసి సభికులను అలరించారు. శేషప్ప కవిత్వం తెలుగు భక్తి సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించడానికి ప్రధాన కారణం ఆయన భాషా సరళి. క్లిష్టమైన సంస్కృత పదజాలం లేకుండా సులభమైన తెలుగు పదాలతో ఆయన రచించిన పద్యాలు ప్రతి ఒక్కరికి సులభంగా అర్థమవుతాయి.భక్తి భావాన్ని సులభమైన పదాలతో వ్యక్తం చేయడం ఆయన కవిత్వానికి ప్రధాన లక్షణం. అందుకే శేషప్ప పద్యాలు గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తృతంగా పఠించ బడు తున్నాయి.ధర్మపురి క్షేత్ర చరిత్రలో శేషప్ప పేరు చిరస్థాయిగా నిలిచి పోయింది.శ్రీలక్ష్మీనరసింహస్వామి భక్తి సంప్రదాయాన్ని ప్రజల్లో విస్తరించడంలో ఆయన రచనలు ముఖ్యపాత్ర పోషించాయి.శేషప్ప పద్యాలలో కనిపించే భక్తి, వినయం, ఆత్మ సమర్పణ భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగిస్తాయి. కార్యక్రమంలో పాల్గొన్న గాయకులను భక్త మండలి ఆధ్వర్యంలో సన్మానించారు.వారికి స్వామి ప్రసాదాలు అందజేసి సత్కరించారు.ఈ సందర్భంగా శేషప్ప భక్త మండలి కన్వీనర్ ఎన్నం బాపురెడ్డి మాట్లాడుతూ శేషప్ప కవిత్వం ధర్మపురి క్షేత్రానికి ఆధ్యాత్మిక గుర్తింపుగా నిలిచిందని అన్నారు.ప్రతి సంవత్సరం బ్రహ్మోత్స వాల సందర్భంగా శేషప్ప శతక గాన కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ఈ సాహిత్య సంపదను తరతరాలకు అందించాలనే లక్ష్యంతో భక్త మండలి కృషి చేస్తోందని తెలిపారు.ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రాచీన వైష్ణవ క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది.గోదావరి తీరంపై వెలసిన ఈఆలయం శతాబ్దాలుగా భక్తులకు ఆధ్యాత్మిక ఆశ్రయంగా నిలుస్తోంది.ఈ క్షేత్రంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలు భక్తి,సంప్రదాయం, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తాయి.ఈ బ్రహ్మోత్సవాల సందర్భంలో నిర్వహించే సాహిత్య,సంగీత కార్యక్రమాలు భక్తి సంప్రదాయాన్ని ప్రజల్లో విస్తరించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి.శేషప్పశతకగాన కార్యక్రమం ద్వారా తెలుగు భక్తి సాహిత్య సంపదను స్మరించుకోవడం మాత్రమే కాకుండా,భక్తి భావాన్ని ప్రజల్లో మరింతగా పెంపొందించడానికి ఇది ఒక వేదికగా మారింది.భక్తి సాహిత్యానికి,సంగీతానికి,ఆధ్యాత్మికతకు ఒకే వేదికగా నిలిచిన ఈ కార్యక్రమం ధర్మపురి సాంస్కృతిక సంప్రదాయాన్ని ప్రతిబింబించింది.ఈ కార్యక్రమంలో భక్తులు,సాహిత్యాభిమానులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శేషప్ప పద్యాల గానం,పఠనం, వివరణలతో సాగిన ఈ కార్యక్రమం చివరికి మంగళ హారతితో ముగిసింది. శేషప్ప కవిత్వం భక్తి మార్గంలో నడిచే వారికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తుందని,ఈ సంప్రదాయాన్ని కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కార్యక్రమంలో పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.ఈ విధంగా ధర్మపురి క్షేత్రంలో నిర్వహించిన శేషప్పశతకగాన కార్యక్రమం భక్తి,సాహిత్యం,సంగీతం సమ్మేళనంగా నిలిచి, తెలుగు భక్తి సాహిత్య సంపదను మరోసారి ప్రజల ముందుకు తీసుకువచ్చింది. శేషప్ప వంటి భక్త కవుల కృషి తెలుగు సంస్కృతిలో చిరస్థాయిగా నిలిచి, తరతరాలకు ప్రేరణగా నిలుస్తూనే ఉంటుంది.

## ప్రగతి ప్రణాళికలో ఉచిత వైద్య శిబిరం

**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్,మార్చి 9 :** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మెట్ పల్లి మండల జగ్గాసాగర్ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం( పీహెచ్‌సీ)లో నేడు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఎల్లాల అంజిత్ రెడ్డి,డా తాటిపర్తి శివాని ఓ ప్రకటనలో తెలిపారు.ఈ వైద్య శిబిరానికి జనరల్ మెడిసిన్,గైనకాలజీ మరియు అబ్స్టెట్రిక్స్, పీడియాట్రిక్స్ ,ఆర్థోపెడిక్స్, ఆప్తాల్మాలజీ మరియు డెంటల్ విభాగాలకు చెందిన స్పెషలిస్టు వైద్యులు హాజరవుతారని ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రజలు తమ ఆరోగ్య సమస్యలకు నిపుణులైన వైద్యుల సలహాలు పొందాలని,అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు .చికిత్స నిమిత్తం వెళ్లే వారు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకుపోవాలని అన్నారు.

## వార్డు సభ్యులకు శిక్షణ



**చురకలు విలేకరి,బీర్‌పూర్,మార్చి 9 :** బీర్‌పూర్ మండలంలో ఇటీవలే ఎన్నికైన వార్డు సభ్యులకు సోమవారం మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని రైతువేదికలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిడివో భీమేష్ వార్డుసభ్యులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపివో మధుసూదన్,టిఓటిలు మల్లికార్జున్,సంతోష్ రావు,అక్బర్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డిని కలిసిన సర్పంచ్



**చురకలు విలేకరి,జగిత్యాల,మార్చి 9 :** కన్నాపూర్ గ్రామ సర్పంచ్ పొట్టవత్తిని సతీష్ సోమవారం హైద్రాబాద్లో జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ తో కలసి రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రితుమ్మల నాగేశ్వ్రరావును కలిసి కన్నాపూర్ గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

## డాక్టరేట్ అందుకున్న సింగం భాస్కర్‌కు సన్మానం



**చురకలు విలేకరి, జగిత్యాల,మార్చి 9 :** జగిత్యాల పట్టణంలోని నేతాజీ వొకేషనల్ జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ సింగం భాస్కర్ గత 38 ఏళ్లుగా విద్యారంగంలో చేస్తున్న కృషిని గుర్తించిన ఇంటర్నేషనల్ తమిళ్ కల్చరల్ యూనివర్సిటీ చెన్నై వారు గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేసిన సందర్భంగా వారిని అంగడి బజార్లో గల స్థానిక మార్కండేయ దేవాలయంలో భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో చిట్ల గంగాధర్, అక్కినపల్లి కాశీనాథం, 22వ వార్డ్ కౌన్సిలర్ అరవ లక్ష్మి, కార్యదర్శి సింగం గంగాధర్, ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు గంగాధర్, కోశాధికారి కొక్కుల ప్రభాకర్, తునికి అంజన్న,సిరిపురం గంగారాం, బొందుకూరి శ్రీనివాస్, ఇల్లెందుల పురుషోత్తం, పెండెం గంగాధర్, ఎడమల వెంకట్ రెడ్డి, వేముల దేవరాజం, గౌరయ్య, మల్యాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల అందజేత



**చురకలు విలేకరి, జగిత్యాల, మార్చి 9 :** జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీసత్యసాయి సేవా సమితి జగిత్యాల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గోల్ సెట్టింగ్ ఐడియాస్, సక్సెస్ మంత్ర, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, ఎక్జామ్ ప్రిపేరేషన్,మోరల్ వాల్యూస్ పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ బట్టు రాజేందర్,చిటుమల్ల లక్ష్మీనారాయణ, వంగల లక్ష్మీనారాయణ,గూడూరు మురళీధర్ రావు,ఉపాధ్యాయులు లతీఫ్, కూరగాయల చంద్రశేఖర్,గంగారాం,సవిత,సునీత దేవి,శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలను కలిసిన ఎమ్మెల్యే సంజయ్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 9 :** జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ సోమవారం హైద్రాబాద్లో జిల్లా ఇన్చార్జి మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాల నియోజకవర్గంలో రైతులు మొక్కజోన్న పంట అధిక మొత్తంలో సాగు చేశారని, రైతులకు ఇబ్బందులు లేకుండా మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజోన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ తెలిపారు.

# క్రీడా చరిత్రలో మరో స్వర్ణాక్షరం - భారత్‌కు టీ-20 ప్రపంచకప్

## -బ్యాటింగ్ తుఫాను... బౌలింగ్ దాడి... కివీస్‌ను చిత్తు చేసిన భారత్

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494....



క్రికెట్ ప్రపంచాన్ని ఉత్కంఠ భరితంగా కట్టిపడేసే అంతర్జాతీయ క్రీడా మహా సంగ్రామం ఐసిసి పురుషుల టి20 ప్రపంచ కప్. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ జట్లు పాల్గొనే ఈ టోర్నమెంట్‌లో ఫైనల్ మ్యాచ్ క్రీడా చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలుస్తుంది. 2026 మార్చి 8న జరిగిన ఫైనల్ పోరు భారత క్రికెట్ చరిత్రలో ఒక విశిష్టమైన విజయ గాథగా నిలిచింది. భారత్..న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన ఈ టైటిల్ సమరం గుజరాత్ రాష్ట్రంలోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా అధిక సంఖ్యాక ప్రేక్షకుల సమక్షంలో జరిగింది. ఉత్కంఠ, ఉత్సాహం, గర్వం, ప్రతిష్ఠల మేళవింపుగా సాగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 96 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ప్రపంచ కప్ ట్రోఫీని మూడోసారి సొంతం చేసుకుంది.ఈ విజయం కేవలం ఒక ఫైనల్ మ్యాచ్ విజయమే కాదు.భారత క్రికెట్ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని రాసిన ఘట్టంగా నిలిచింది. ఈ విజయంతో భారత్ వరుసగా రెండు సార్లు టీ--20 ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా నిలిచింది. అంతేకాదు, స్వదేశంలో ప్రపంచకప్ గెలిచిన తొలి దేశంగా కూడా చరిత్ర సృష్టించింది.టోర్నమెంట్ ప్రారంభం నుంచే భారత జట్టు అద్భుత ప్రదర్శనతో ముందుకు సాగింది. గ్రూప్ దశలో ప్రత్యర్థి జట్లపై వరుస విజయాలు సాధిస్తూ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత సూపర్ దశలో కూడా జట్టు సమన్వయంతో ఆడింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడు విభాగాల్లో సమతుల్యత చూపుతూ ప్రత్యర్థులను మట్టికరిపించింది. సెమీఫైనల్ మ్యాచ్‌లో కూడా భారత్ భారీ స్కోరు నమోదు చేసి ఫైనల్‌కు దూసుకెళ్లింది.న్యూజి లాండ్ జట్టు కూడా ఈ టోర్నమెంట్‌లో అత్యంత స్థిరమైన ప్రదర్శన చేసింది. వారి క్రమశిక్షణ,బౌలింగ్ సామర్థ్యం, జట్టు సమన్వయం కారణంగా వారు ఫైనల్‌కు చేరుకున్నారు.సెమీఫైనల్‌లో బలమైన ప్రత్యర్థిని ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించారు.అందువల్ల ఫైనల్ మ్యాచ్ ప్రారంభానికి ముందు ఈ రెండు జట్ల మధ్యపోరు సమానంగా ఉండబోతుందని క్రీడా విశ్లేషకులు భావించారు.ఫైనల్ మ్యాచ్ రోజు అహ్మదాబాద్ స్టేడియంలో అపూర్వమైన వాతావరణం నెలకొంది. భారత అభిమానులు స్టేడియాన్ని నీలిరంగుతో నింపారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లది మంది ప్రేక్షకులు ఈ మ్యాచ్‌ను వీక్షించారు.టాస్ గెలిచిన న్యూజిలాండ్ జట్టు ముందుగా ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు ప్రారంభం నుంచే దూకుడైన ఆటతీరును ప్రదర్శించింది.భారత్ ఇన్నింగ్స్‌కు పునాది వేసింది ఓపెనింగ్ బ్యాటింగ్. సంజు శాంసన్ మరియు అభిషేక్ శర్మ జోడీ కేవలం 43 బంతుల్లోనే 98పరుగులు జోడించారు.ఆ తర్వాత మధ్య ఓవర్లలో భారత బ్యాట్స్‌మన్‌లు పరుగుల వర్షం కురిపించారు. ముఖ్యంగా సంజు శాంసన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి మ్యాచ్ గమనాన్ని పూర్తిగా మార్చేశాడు.కేవలం 46బంతుల్లో 89 పరుగులు చేసి న్యూజిలాండ్ బౌలర్లను చిత్తుగా చేశాడు.అతని ఇన్నింగ్స్‌లో పలుఫోర్లు,సిక్సర్లు ఉండటంతో భారత స్కోరు వేగంగా పెరిగింది.సంజు శాంసన్ ఈ మ్యాచ్ లోనే కాకుండా టోర్నమెంట్ అంతటా బాగా ఆడి "ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు కూడా గెలుచుకున్నారు.

**అతనికి తోడుగా ఇషాన్ కిషన్**

అర్ధశతకం నమోదు చేశాడు. కేవలం 25 బంతుల్లో 54 పరుగులు చేసి జట్టుకు భారీ ఊపు తీసుకొచ్చాడు. మరోవైపు యువ ఆటగాడు అభిషేక్ శర్మ కేవలం 21బంతుల్లో 52 పరుగులు చేసి న్యూజిలాండ్ బౌలింగ్‌పై దాడి కొనసాగించాడు.చివర్లో శివం దూబె వేగంగా పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు సాధించడంలో సహకరించాడు.20 ఓవర్ల ముగింపులో భారత్ 5 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది .టీ--20 ప్రపంచకప్ ఫైనల్ చరిత్రలో ఇది అత్యధిక స్కోరుగా నమోదైంది.ఈ భారీ స్కోరు న్యూజి లాండ్ జట్టుపై తీవ్రమైన ఒత్తిడిని సృష్టించింది.256 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన న్యూజిలాండ్ జట్టు మొదటి ఓవర్ల నుంచే కష్టాల్లో పడింది. భారత బౌలర్లు కచ్చితమైన లైన్ లెంగ్త్ తో బౌలింగ్ చేసి కీలక వికెట్లు తీశారు. పవర్‌ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోవడంతో న్యూజిలాండ్ జట్టు ఒత్తిడిలో పడింది.

**న్యూజిలాండ్ తరపున టిమ్ సీఫెర్ట్**

కొంత ప్రతిఘటన చూపించాడు. అతను 26 బంతుల్లో 52 పరుగులు చేసి జట్టుకు ఆశలు కలిగించాడు. తరువాత కెప్టెన్మిచెల్ సాంట్నర్ 43 పరుగులు చేసి కొంత పోరాటం చేశాడు. అయితే భారత బౌలింగ్ దాడి ముందు వారి ప్రయత్నాలు నిలవలేక పోయాయి.భారత బౌలర్లలో ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. నాలుగు ఓవర్లలో కేవలం 15 పరుగులు మాత్రమే ఇచ్చి 4 కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను పూర్తిగా భారత వైపు తిప్పేశాడు. అతని యార్కర్లు, స్లో బంతులు న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్‌లకు అర్థంకాని సవాలుగా మారాయి. ఈ ప్రదర్శనకు గాను అతనికి "మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్" అవార్డు లభించింది.అలాగే అక్షర్ పటేల్ కూడా మూడు వికెట్లు తీసి న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌ను కుదేలు చేశాడు. స్పిన్ మరియు పేస్ బౌలింగ్ సమన్వయం కారణంగా న్యూజిలాండ్ జట్టు పరుగులు చేయలేకపోయింది. చివరికి న్యూజిలాండ్ జట్టు 19 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో భారత్ 96 పరుగుల తేడాతో విజయం సాధించింది. గణాంకాల పరంగా చూస్తే ఈ మ్యాచ్‌లో భారత్ 20 ఓవర్లలో 255/5 పరుగులు చేసింది.న్యూజిలాండ్ జట్టు19 ఓవర్లలో 159 పరుగులు మాత్రమే చేసింది. భారత్ తరపున సంజు శాంసన్ 89 పరుగులు, ఇషాన్ కిషన్ 54 పరుగులు, అభిషేక్ శర్మ 52 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించారు. బౌలింగ్ విభాగంలో బుమ్రా 4 వికెట్లు, అక్షర్ పటేల్ 3 వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించారు.విజయానికి నాయకత్వం వహించిన సూర్యకుమార్ యాదవ్ కృషిని మెచ్చుకోకుండా ఉండలేము.ఈ విజయంతో భారత్ మూడు సార్లు టీ-20 ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా నిలిచింది. అంతకుముందు 2007లో మరియు 2024లో భారత్ ఈటైటిల్ సాధించింది.ఇప్పుడు 2026లో మూడోసారి ప్రపంచకప్ గెలిచి కొత్త చరిత్ర సృష్టించింది.స్వదేశంలో టీ20 ప్రపంచకప్ గెలిచిన తొలి దేశంగా భారత్ రికార్డు సృష్టించింది.మొత్తం మీద చూస్తే ఈ ఫైనల్ మ్యాచ్ భారత క్రికెట్ చరిత్రలో ఒక అద్భుత ఘట్టంగా నిలిచింది. ధైర్యం, సమిష్టి కృషి, వ్యూహాత్మక ఆటతీరు కలిసినప్పుడు విజయం ఎలా సాధ్యమవుతుందో ఈ మ్యాచ్ మరోసారి నిరూపించింది. బ్యాటింగ్‌లో దూకుడు,బౌలింగ్‌లో కచ్చితత్వం,ఫీల్డింగ్‌లో చురుకుదనం ---ఈ మూడు విభాగాల్లోనూ భారత్ పూర్తి ఆధిపత్యం చూపించింది.ఈ విజయం భారత క్రికెట్ భవిష్యత్తుకు మరింత ప్రేరణనిచ్చే ఘట్టంగా నిలిచింది. ప్రపంచ క్రీడా వేదికపై భారత జట్టు ప్రతిష్టను మరింత పెంచిన ఘన విజయం ఇదిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

## గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్‌డేను

# విజయవంతం చేయాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 9 :** గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ దేను విజయవంతం చె యాలి టియుజెఏసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మార్వాడి సుదర్శన్ అన్నారు. జగిత్యాల పట్టణంలో గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డే పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ రేపుజరగబోయే మిలియన్ మార్చ్‌కు ఉద్యమకారులు అధిక సంఖ్య లో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ, ఆత్మగౌరవం నీళ్ళు నిధులు నియామకాలు, స్వయంపాలన కోసం జరిగిన సుదీర్ఘ తెలంగాణ ఉద్యమ చరిత్రలో తెలంగాణ మిలియన్ మార్చ్ ప్రత్యేక స్థానం అని పేర్కొన్నారు ప్రపంచ చరిత్రలో అది చెరగని అధ్యాయం పది మార్చి 2011 లో జరిగిన మిలియన్ మార్చ్ తెలంగాణ మట్టిమనుషులకు గుండెచప్పుడు ప్రపంచానికి వినిపించిందన్నారు. సీమాంధ్ర దోపిడీ పాలనపై దండెత్తిన తెలంగాణ ప్రజలు ఆధిపత్య ఆంధ్ర సర్కార్ గుండెల్లో రైలు పరిగెించిద న్నారు.ఇప్పటికైనా ఉద్యమకారులకు సమస్యల పట్ల కాలయాపన చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరిచి ఉద్యమకారుల సంక్షేమం కోసం ఉద్యమకారులతో చట్టబద్ధమైన కమిటీ ఏర్పరిచి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని అమరుల కుటుంబాలను ఉద్యమకారులకు ఇస్తానన్న 250 గజాల ఇంటి స్థలాన్ని గృహ నిర్మాణం 25 వేల గౌరవ భృతి జీవనోపాధి గుర్తింపు కార్డులు హెల్త్ కార్డులు జారీచేయాలని 100ఎకరాల్లో అమర వీరుల స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రేపు హైదరాబాదులో గన్ పార్క్ వద్ద జరగబోయే మార్చిన విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఉద్యమకారులను కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్ఆర్ఎ సెల్ రాష్ట్ర కన్వీనర్ షేక్ చాంద్ పాషా, దళిత లిబరేషన్ ఫ్రంట్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు రాజేష్ ప్రవీణ్, న్యాయవాదులు క్యాసజైపాల్ రెడ్డి, గుండేటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవి కట్ట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్స్‌పై అవగాహన కార్యక్రమం

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 9 :** ఇటీవల అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్స్ పై అవగాహన కార్యక్రమము సోమవారం రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని ఆర్జి 4జియం కార్యాలయం నందు నిర్వహించడం జరిగినది.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) హైదరాబాద్, తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ బిస్వ భూషణ్ ప్రుష్టి,అతిథులుగా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) మంచిర్యాల, రామగుండం, యం.డి.యూసప్ చౌటుపల్లి, రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ పాల్గొన్నారు.ముందుగా రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, ఇతర అధికారులు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) హైదరాబాద్ రీజియన్ బిస్వభూషణ్ ప్రుష్టినీ సన్మానించి, స్వాగతం పలికారు.అనంతరం వివిధ గనుల, విభాగాల అధికారులకు, సంక్షేమ అధికారులకు, కాంట్రాక్టర్లకు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది.ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) హైదరాబాద్ రీజియన్ శ్రీ బిస్వ భూషణ్ ప్రుష్టి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఉన్న 29 చట్టాలను కొత్తగా నాలుగు లేబర్ కోడ్స్ గా 21 నవంబర్ నుండి



మార్చడం జరిగినదని, దీని అమలు పై అవగాహన కార్యక్రమం ద్వారా అందరికీ ఉపయోగకరమైన మార్గదర్శకాలు లభిస్తాయని కార్మికుల సంక్షేమం, హక్కులు, భద్రత, వేతన నిర్మాణం, పారదర్శక ఉద్యోగ వ్యవస్థ కోసం,కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ కొత్త లేబర్ కోడ్స్ సరిగ్గా అర్థం చేసుకుని అమలు చేయడం అత్యంత అవసరం అని తెలిపారు. కార్యక్రమంలో ఎస్వోటుజిఎంలు యం.రామ్మోహన్, బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జనార్దన్, విభాగాధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహ స్వామి హుండీ లెక్కింపు పూర్తి



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్‌మార్చి 09 :** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నల్లగొండ శ్రీ సీతారామ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. దీంతో ఆలయ హుండీల లెక్కింపు ఈఓ నాగుల అనిల్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ బందారిపల్లి లక్ష్మణ్ సమక్షంలో జరిగింది. గత 8 రోజులుగా స్వామి వారికి భక్తులు సమర్పించిన కట్నకానులకు సంబంధించిన హుండీలను తెరిచి లెక్కించగా రూ. 17లక్షల 62వేల523 తో పాటు బంగారం, వెండి లభించినట్లు వివరించారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం ఆదాయం అధికంగా వచ్చిందన్నారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని బందారిపల్లి లక్ష్మణ్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని రకాల వసతులు కల్పించామన్నారు. దేవాలయాన్ని గతం కంటే అభివృద్ధి చేసామని ... భవిష్యత్తులో కూడా చేస్తామని.. దీంతో ప్రభుత్వానికి ఆదాయం మరింత వస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జింక మారుతి, కరీంనగర్ డివిజన్ ఇన్స్పెక్టర్ పి. సత్యనారాయణ, డైరెక్టర్లు గాజుల అంజయ్య, బూత్కూరి శ్రీనివాస్, కందుకూరి లక్ష్మీరాజం, జింక శ్రీనివాస్,కవ్వంపల్లి మహేష్, గోలి లక్ష్మీ నరసయ్యలు పాల్గొన్నారు.